క్లుప్తంగా

యర్రంరెడ్డి జన్మదిన వేడుకలకు హాజరైన దద్దాల


యర్రంరెడ్డితో దద్దాల, ఇతర నాయకులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు యర్రంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆయనకు తినిపించారు. ఈ సందర్భంగా దద్దాలను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ ముత్యాల భారతి, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, ఎస్.శివారెడ్డి, నారాయణరెడ్డి, జి.రమణారెడ్డి, కొండయ్య, తిరుపతరెడ్డి, ఎం.రమణయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.27,440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను మంగళవారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీళ్లు.. పట్టించుకోని అధికారులు


పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

కొండపి: కొండపి ప్రధాన రహదారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా మంచినీటి పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. రెండు వారాలుగా నీరు వృథా అవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పైపు పగిలిపోయి నీరు వృథాగాపోతూ రహదారి మొత్తం నీటితో నిలిచిపోయింది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నీరు చింది పాదచారులపై పడుతున్నాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ పగలడం వలన నీరు కలుషితమై వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పొగాకు బోర్డు ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్ర


విజ్ఞాన యాత్రకు బయలుదేరుతున్న రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది

టంగుటూరు: టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలోని రైతులు, క్షేత్రస్థాయి సిబ్బందికి పొగాకు బోర్డ్ వేలం నిర్వహణ అధికారి ఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం విజ్ఞాన యాత్ర నిర్వహించారు. చీరాలలోని గ్రీన్ లీఫ్ త్రెస్సింగ్ ప్లాంట్‌ను సందర్శించారు. రైతుల దగ్గర కొనుగోలు చేసిన పొగాకును ఎటువంటి పద్ధతి ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులకు విక్రయిస్తారు, పొగాకు ప్యాకింగ్‌లో పాటించాల్సిన అంతర్జాతీయ ప్రమాణాల గురించి తెలుసుకున్నారు. ప్లాంట్లో దశలవారీగా జరిగే ప్రక్రియలను పరిశీలించారు. పొగాకు గ్రేడ్లను, అలాగే పొగాకేతర అన్య పదార్థాలను వేరు చేసే విధానాలను, యంత్రాలను సందర్శించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, వేలం కేంద్రం పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల పట్టలు పంపిణీ


రైతులకు పొగాకు బేలు పట్టలు అందిస్తున్న వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్

కొండపి: స్థానిక పొగాకు బోర్డు పర్పిధిలోని రైతులకు పొగాకు బేళ్ల పట్టలను సోమవారం పంపిణీ చేశారు. వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్ల పట్టల కోసం వేలం కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్క రైతు తమ వెంట బోర్డు పాసు పుస్తకాన్ని తీసుకురావాలని కోరారు. వారికి మాత్రమే బేలు పట్టలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పొగాకు బోర్డు పరిధిలోని రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సభ్యులు వడ్డపాటి బ్రహ్మయ్య, బోర్డు క్షేత్రస్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు


చిల్లచెట్లతో నిండి ఉన్న బలిజపాలెంలోని శ్మశానం


ప్రహరీ లేని మోపాడు అంబేడ్కర్ నగర్‌కు సంబంధించిన శ్మశానం

ఆత్మలు ఘోషిస్తున్నాయి..

- అభివృద్ధికి నోచుకోని శ్మశానాలు
- చిల్ల చెట్లతో నిండి అడవిని తలపిస్తూ..
- కొన్ని శ్మశానాలకు వెళ్లే దారులు కూడా అధ్వానం


కందుకూరుకు సమీపంలో ఉన్న మహదేవపురం శ్మశానం

కందుకూరు రూరల్: శ్మశానాల్లో చిల్ల చెట్లు, పిచ్చి కంపలతో లోపలకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేసేందుకు బంధువులు నానా అవస్థలు పడుతున్నారు. చనిపోయినా వారికి ఆరడుగుల గుంట తీసేందుకు కూడా వీల్లేని పరిస్థితులున్నాయి.

కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లోని శ్మశానాలు చిల్ల చెట్లు, పిచ్చి కంపలతో నిండి ఉన్నాయి. ఇవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. శ్మశానాల్లో కొందరిని దహనసంస్కరణలు చేస్తారు. మరి కొందరిని పూడ్చిపెడతారు. ఇలా పూడ్చిన, దహనం చేసిన మృతదేహాలకు గుర్తుగా వారి బంధువులు సమాధులు నిర్మిస్తారు. మృతుల వర్ధంతి, జయంతి దినాల్లో, సంక్రాంతి పండుగల సమయాల్లో సమాధుల వద్దకు వెళ్లి పూజలు చేస్తారు. ఇలా చేసుకునేందుకు కనీసం శ్మశానంలోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి.

బలిజపాలెం గ్రామానికి చెందిన శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించినా లోపల మాత్రం చిల్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. శ్మశానానికి వెళ్లే దారిలో కూడా చెత్తచెదారం వేసి ఉంది. అదే విధంగా మోపాడు అంబేడ్కర్‌కు చెందిన శ్మశానం గ్రామానికి సమీపంలోనే ఉంటుంది. శ్మశానానికి చుట్టూ వరి పొలాలు ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో మృతదేహం దహనం చేసే సమయంలో కనిపిస్తుండడంతో ప్రజలు, మహిళలు, పిల్లలు భయాందోళన చెందుతున్నారు. శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు విన్నవిస్తున్నారు. అదే విధంగా ప్రహరీ లేక చుట్టూ ఉన్న పొలాల వారు శ్మశాన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని తెలిపారు. ప్రహరీ నిర్మిస్తే ఆక్రమణలు కూడా అరికట్టినట్లు ఉంటుందన్నారు. మహదేవపురం పంచాయతీలోని మూడు శ్మశానాలు బయటకు బాగానే కనిపిస్తున్నా లోపల చిల్ల చెట్లతో అధ్వానంగా ఉన్నాయి. అదే విధంగా పందలపాడు గ్రామానికి ప్రత్యేకంగా శ్మశానం లేదు. ఊరు పక్కన ఉన్న పాలేరు నది ఒడ్డునే దహన సంస్కారాలు చేస్తుంటారు. కర్మకాండలు చేయాలంటే ప్రత్యేకంగా షెల్టర్లు కూడా లేవు. చెట్ల కింద లేదా టెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలి. పాలేరు నదిలో నీరు లేకపోతే ప్రత్యేకంగా ట్యాంకర్లలో నీటిని ఏర్పాటు చేసుకొని కర్మకాండలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి శ్మశానాలను అభివృద్ధి చేసి సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పెదవెంకన్నపాలెంలో గొర్రెకు చికిత్స చేస్తున్న డాక్టర్ శివరామకృష్ణ


పచ్చవలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పొన్నలూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శివరామకృష్ణ కోరారు. మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించి గేదెలకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, చూలు కట్టకుండా ఉండే పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ గొర్రెలకు బొబ్బ వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందులు తాపించాలన్నారు. అనంతరం పాడి పశువుల నుంచి అధిక పాల ఉత్పత్తి రావడానికి మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తాం...

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని అన్ని గ్రామాల్లో ముందస్తు ప్రణాళికల ప్రకారం పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి జె.శ్రావణి తెలిపారు. జరుగుమల్లి మండలంలోని పచ్చవ ఆర్‌బీకే వద్ద సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆమె పాల్గొని పశువులకు నట్టల నివారణ మందు తాపించారు. ఎదకు రాని, తిరగకట్టు పశువులను పరిశీలించి మందులిచ్చారు. ఈ నెల 31వ తేదీ వరకు గ్రామాలవారీగా షెడ్యూల్ ప్రకారం పశువైద్య శిబిరాలు జరుగుతాయని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు వావిలేటిపాడులోని రైతు సేవా కేంద్రం వద్ద పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

పశు వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన అసిస్టెంట్ డైరెక్టర్...

కొండపి: మండలంలోని పెద్ద కండ్లగుంట గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 20 నుంచి 31వ తేదీ వరకు మండలంలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ పేరయ్య 21 గేదెలను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. 15 గేదెలలో గర్భాశయ వ్యాధులను గుర్తించి వైద్యం చేశారు. 12 గేదెలకు, 34 దూడలకు, 876 గొర్రెలకు డీవార్మింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో జేవీఓ విజయ్ కుమార్, ఏహెచ్‌ఏడబ్ల్యూ రామస్వామి, తరుణ్, నాగేశ్వరరావు, నందిని, నవీన్, క్రాంతి కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం (పామూరు): పశుపోషకులు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు సోకే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మునీర్ పేర్కొన్నారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అంబవరం కొత్తపల్లి, వీబైలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించిన డాక్టర్ మాట్లాడుతూ మండలంలో ఈ నెల 31 వరకు వైద్యశిబిరాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పశుపోషలకు నల్ల, తెల్లజాతి గేదెలు, జీవాల్లో వచ్చే వ్యాధులు, లక్షణాలు తెలిపి నివారణ చర్యలు సూచించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరంలో 600 జీవాలకు, 110 పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. 196 పశువులకు సాధారణ చికిత్స చేసి 6 గేదెలకు కృత్రిమ గర్భధారణ చేసినట్లు తెలిపారు. నల్లమడుగుల జేవీఓ శ్రీనివాసులు, పశువైద్య సహాయకులు శివనారాయణ, నవీన్, రాజేష్, తిరుపతయ్య, పశుపోషకులు పాల్గొన్నారు.


పశువైద్యశిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మునీర్

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి


పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్

పొన్నలూరు: విధి నిర్వహణలో పోలీసులు నిబద్ధతతో పనిచేసి ఫిర్యాదుదారులకు జవాబుదారీగా ఉండాలని కొండపి సీఐ సోమశేఖర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పెండింగ్ కేసులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. పేకాట, గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో దొంగతనాలు జరగకుండా గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజూ పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధి నిర్వాహణలో అవకతవకలకు పాల్పడినా, అలసత్వం వహించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాగేశ్వరరావు సేవలు మరువలేనివి

మద్దిపాడు: ఫెరల్ మినరల్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వరలక్ష్మీ ఎక్స్‌ప్రెస్ చైర్మన్ చలువాది నాగేశ్వరరావు గోశాలకు చేసిన సేవలు మరువలేనవని పలువురు కొనియాడారు. శ్రీ లక్ష్మీనృసింహస్వామి గోశాల వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో దివంగత చలువాది నాగేశ్వరరావు జ్ఞాపకార్థం సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో పలువురికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి నాట్య మండలి అధ్యక్షుడు సారెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ మద్దిపాడు కొండపై ఉన్న లక్ష్మీనృసింహస్వామి గోశాల వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు


బైక్‌పై ట్రిపుల్స్ వెళ్తున్న వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సై

పామూరు: పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని గోపాలపురం వద్ద 565 జాతీయ రహదారిపై వాహనాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతులకు మించి ప్రయాణికులను ఎక్కించిన ఆటో డ్రైవర్లకు, మోటార్ బైక్‌పై ట్రిపుల్స్ వెళ్తున్న వారికి సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనానికి లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. డ్రైవర్ విధిగా యూనిఫాం ధరించి ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు జరిమానా విధించారు. ఎస్సై టి.కిశోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దద్దాలను సన్మానించిన భూమిరెడ్డి ప్రభంజన దంపతులు


దద్దాలతో ప్రభంజన, వెంకటరెడ్డి దంపతులు

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను సీఎస్‌పురం ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి దంపతులు బెంగళూరులోని తమ నివాసంలో సోమవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల భారతి, నారాయణరెడ్డి, సన్నపురెడ్డి శివారెడ్డి, ముత్యాల రమణారెడ్డి, గూడుపురెడ్డి రమణారెడ్డి, జి.తిరుపరెడ్డి, మునగల రమణయ్య, రమణారెడ్డి, దోడ సుధాకర్‌రెడ్డి, బద్దల లక్ష్మీరెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం స్వర్ణ, ఏడుకొండలరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కొండపి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కుమార్


సింగరాయకొండ: పోటీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

కొండపి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కొండపి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ కుమార్ కోరారు. కొండపిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సమావేశపు గదిలో సోమవారం కొండపి తహసీల్దార్ మురళి అధ్యక్షతన ఓటర్ల దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటర్నింగ్ అధికారి ఏ కుమార్ హాజరై మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నియోజవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆరు మండలాల్లో సోమవారం మండల స్థాయి క్విజ్, వ్యాసరచన, డిబేట్ పోటీలను జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మంగళవారం నియోజవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామని, ఇందులో ఎన్నికైన విద్యార్థులు 23వ తేదీ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా 25వ తేదీ బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. మంగళవారం నియోజకవర్గస్థాయి పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని తెలిపారు. 25వ తేదీ ఓటర్ల దినోత్సవంపై అవగాహన ర్యాలీ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వయోవృద్ధుల ఓటర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, ఏపీఎంలు, మండల విద్యాశాఖ అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు

సింగరాయకొండ: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాల, ప్రైవేటు కాలేజీలో సోమవారం విద్యార్థులకు మండల స్థాయిలో క్విజ్, డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ టి.రవి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కాలేజీ విద్యార్థులకు మలినేని సుశీలమ్మ ఇంజినీరింగ్ కాలేజీలో, పీఎస్‌సీపీ డిగ్రీ కాలేజీలో పోటీ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 23వ తేదీ కొండపిలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని, నియోజకవర్గస్థాయి విజేతలు ఈ నెల 25వ తేదీ ఒంగోలులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఎంఈఓ-1 కత్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించామన్నారు. రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు గోల్డ్ కాయిన్స్ అందజేత


గోల్డ్ కాయిన్స్ అందజేస్తున్న యాదాల సాయికిరణ్

పామూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం కొనియాడదగినదని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రామస్వామి అన్నారు. మండల కేంద్రం పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 565 మార్కులు పైబడిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని నాడు వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు, ఉప సర్పంచ్ యాదాల సాయికిరణ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గత విద్యాసంవత్సరంలో పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు జి.అశ్రిత (578), ఎన్.లక్ష్మీప్రణవి (571)లకు ఒక్కొక్కరికి రు.10 వేల విలువ చేసే గోల్డ్ కాయిన్స్‌ను దాత యాదాల సాయికిరన్ అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఘనంగా సన్మానించారు. ఎస్ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, మంచికంటి మధు, రాష్ట్ర మత్స్యకార, బెస్త సంఘం ఉపాధ్యక్షుడు ఓగూరు ఏడుకొండలు, వార్డు సభ్యులు షేక్ జిలానీ, ఎంపీటీ నాయబ్ రసూల్, బొప్పూరు రాజేష్, పీడీ మాస్తాన్‌బీ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి నింపేందుకే ఆటల పోటీలు


కారుమంచి టీంకు ట్రోఫీ అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కుమార్

కొండపి: ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ ఏ కుమార్ అన్నారు. కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఎస్ఆర్కే యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గెలుపోటములను ప్రతిఒక్కరూ సమానంగా తీసుకోవాలని ఆటగాళ్లకు సూచించారు. క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కారుమంచి టీమ్, కొండపి టీంకు మధ్య జరగ్గా, కారుమంచి టీం విజేతగా నిలిచింది. మొదటి స్థానంలో నిలిచిన కారుమంచి టీంకు రూ.50 వేల నగదు, రెండో స్థానంలో నిలిచిన కొండపి టీంకు రూ.30 వేల నగదు, మూడో స్థానం సాధించిన దాసిరెడ్డిపాలెం టీంకు రూ.15 వేల నగదు, షీల్డ్స్ అందజేశారు. క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కొండపి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, తహసీల్దార్ పి.మురళి, కొండపి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్ఆర్కే యూత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ


మిరప తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ అంజలీబాయి

హనుమంతునిపాడు: మిరప రైతులు సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను 90 శాతం నివారించ వచ్చని కనిగిరి డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి ఎం.అంజలీబాయి అన్నారు. ఆమె సోమవారం మండల పరిధి హనుమంతాపురంలో రైతులు సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. మిరపకు నల్ల, కాయ తొలుసు పురుగు, ఆకు ముడత, కుచ్చు తెగుళ్లు, తామర పురుగు, తెల్ల దోమ, కొమ్మ ఎండు తెగులున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచలిచ్చారు. నల్లతో చెట్టు ఆకులు కిందకు ముడుచుకుని ఉంటాయన్నారు. చెట్టు పెరుగుదల కూడా గిడసబారి పోతుందన్నారు. ఎండు కొమ్మలు విరిచేసి కాల్చి వేయాలన్నారు. తెగుల్ల నివారణకు వాడాల్సిన మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలిచ్చారు. వీఏఏ సుప్రజ పాల్గొన్నారు.